

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

మంగళవారం,8 జులై 2025

8 పేజీలు


## ప్రైవేట్ పాఠశాలల్లో కూడా

# మెగా పేరెంట్స్ మీట్

### 10వ తేదీన ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్‌లో నిర్వహించాలి

### ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'మెగా పేరెంట్స్ మీట్'ను జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో కూడా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో ప్రైవేట్ పాఠశాలల్లో కూడా 'మెగా పేరెంట్స్ మీట్' ఏర్పాటుపై సోమవారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణలలో భాగంగా మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్(పిటిఎం) నిర్వహణకు శ్రీకారం చుట్టిందని, ఈనెల 10వ తేదీ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటుఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్, జూనియర్ కళాశాలలో మెగాపిటిఎం 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులవిద్యాపురోగతి కోసం ప్రజల భాగస్వామ్యం ముఖ్యంగా తల్లితండ్రుల పాత్రమెగా పిటిఎంలో కీలకమని, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి వేదికగా పనిచేస్తోం దన్నారు. విద్యా పురోగతి, ప్రవర్తన సామజిక సమస్యల గురించి అవగాహన చేసుకోవడానికి మెగా పిటిఎం ఎంతగానో దోహదపడుతుందన్నారు. జిల్లాలో 1810 ప్రభుత్వ, 558 ప్రైవేట్ పాఠశాలలు మొత్తం 2,368 పాఠశాలల్లోనూ, మరియు140 జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని,ఈకార్యక్రమం విజయవంతం అయ్యేందుకు ప్రైవేట్‌పాఠశాలల యాజ మాన్యాలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం నిర్వహించాలన్నారు.ఆరోజు జరగనున్న కార్యక్రమాలపై విద్యార్థులచే ఇన్విటేషన్ రూపొందించి తల్లితండ్రులకు, ప్రముఖులకు అందేలాచర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా విద్యార్థులచే తల్లితండ్రులు, ప్రముఖులకు స్వాగతం పలకాలని, తల్లితండ్రులు, అమ్మ ప్రాముఖ్యతను తెలియజేసేలా తల్లికి వందనం నిర్వహించాలని, సాంస్కృతిక కార్యక్రమాలు,విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఫోటో సెషన్ నిర్వహించాలన్నారు.పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటించాలని, నాటిన మొక్కలను 3 నెలలపాటు ఆయా విద్యార్థులు పరిరక్షించేలా

- తరువాయి 2లో..



## అల్లూరి మెమోరియల్ హాల్ పునర్నిర్మాణానికి

# తక్షణ చర్యలు..

### – కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ హామీ

**భీమవరం, మేజర్‌న్యూస్ :** మన్యం వీరుడు, స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజును స్మరించుకునే విధంగా మెమోరియల్ హాలు ఆధునిక సౌకర్యాలతో పునర్నిర్మాణం కోసం సంబంధిత అధికారులతో చర్చించి, తగిన చర్యలు జరుగుతుందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమ శాఖసహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఎఎస్ఆర్ మెమోరియల్ హాల్ పునర్నిర్మాణ సాధన కమిటీకి హామీ ఇచ్చారు. భీమవరం పాత బస్టాండ్ సమీపంలో ఉన్న ఎ.ఎస్.ఆర్. మెమోరియల్ హాల్ ను వెంటనే పునర్నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం తక్షణ చర్యలు తీసుకోవాలి అని సాధన కమిటీ సభ్యులు సోమవారం కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మను కలసి వినితిపత్రం ఇచ్చి విజ్ఞప్తి చేశారు. సాధన కమిటీ సభ్యుల విజ్ఞప్తికి వెంటనే స్పందించిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ. భీమవరం మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆర్డీవోతో ఫోన్లో మాట్లాడారు పూర్తి

- తరువాయి 2లో..

# అధిక వర్షాలు,వరదలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

### – రానున్న మూడు రోజులు భారీ వర్షాలకు సూచన



**భీమవరం,మేజర్‌న్యూస్ :** గత సంవత్సరకాలంలో అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో భారీ వర్షాలు,వరదలు, తుఫానులను సమర్థవంతం ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. వాతావరణ శాఖ జిల్లాకు రానున్న మూడు రోజులలో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు,అధికార యంత్రాంగం అప్రమత్తతతో పూర్తి సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ టీఆర్ఎస్ సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వర్షాకాలం సీజన్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ గత సంవత్సరం అధిక వర్షాలు, వరదలు కారణంగా పెద్ద ఎత్తున ఇబ్బందులను

- తరువాయి 2లో..



## పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ల్యాప్ టాప్‌లు పంపిణీ చేసిన ఐ.జి,ఎస్‌పి..

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఆధునిక సాంకేతికతతో న్యాయ వ్యవస్థ బలోపేతం కోసం ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్ కుమార్ ,జిల్లా ఎస్పీ కె.ప్రతాప్‌శివకిషోర్ అందచేశారు మారుతున్న కాలానికి అనుగుణంగా,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని న్యాయ వ్యవస్థలో సమర్థ వంతంగా వినియోగించేందుకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ,అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసి క్యూటర్లకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

- తరువాయి 2లో..

# 208 ఫోన్లు రికవరీ చేసిన ప.గో.జిల్లా పోలీసులు

### రూ.31లక్షల విలువైన మొబైల్స్ అందజేత



**భీమవరం, మేజర్‌న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లాలో చోరీకి గురైన లేదా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి రికవరీ చేయడంలో జిల్లా పోలీసులు మరోసారి విజయాన్ని సాధించారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పర్యవేక్షణలో 208 మొబైల్ ఫోన్లను పదవ విడతలో రికవరీ చేసి, వాటిని సోమవారం బాధితులకు పంపిణీ చేశారు. ఈ ఫోన్ల విలువ సుమారు రూ.31 లక్షలు. ఇప్పటి వరకు 10 విడతల్లో మొత్తం 1,612 ఫోన్లు రికవరీ కాగా, వాటి విలువ సుమారు రూ.2.40 కోట్లు.ఎస్పీ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోయిన ప్రతి ఒక్కరు ఇంటి వద్ద నుంచే 9154966503 వాట్సాప్ నంబరుకు "Hi" లేదా "Help" అని మెసేజ్ చేసి వచ్చిన లింక్ ద్వారా వివరాలు నమోదు చేయడం ద్వారా రిపోర్ట్ చేయొచ్చని, ఈవిధానం ద్వారా స్టేషన్‌కు వెళ్లకుండానే ఫోన్లను తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

- తరువాయి 2లో..

## అధిక వర్షాలు,వరదలను
# సమర్థవంతంగా ఎదుర్కోవాలి

మొదటిపేజి తరువాయి

ఎదుర్కొన్నామని, అటువంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలన్నారు. రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు ముందస్తుగా బలహీనంగా ఉన్న కాలువ గట్లు, నదీ పరివాహక ప్రాంతం గట్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన ఇసుక బస్తాలు,సరుగుడు బాదులు సిద్ధంగా ఉంచాలన్నారు. వరద ముంపుకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతంలోని షెల్టర్లను మరమ్మత్తులు చేయించి సిద్ధం చేయాలన్నారు. రహదారులు భవనాలు శాఖ బలహీనంగా ఉన్న బ్రిడ్జిలు, రోడ్డు మార్గాలు గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లోని 35 చౌక ధరల దుకాణాల్లో నిత్యాసర వస్తువులను ముందస్తుగా నిల్వ ఉంచాలన్నారు. అలాగే పెట్రోలు, డీజీలు, ఎల్పిజి నిల్వలను పర్యవేక్షించాలన్నారు. జిల్లా ఆరోగ్యశాఖ గర్భిణీలను, వృద్ధులను, అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారిని ముందస్తుగా గుర్తించి జాబితాను సిద్ధం చేయాలన్నారు. అవసరమైతే సురక్షితమైన ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుందని తెలిపారు. ఫస్ట్ ఎయిడ్ కిట్స్, అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఏ ఒక్కరూ విద్యుత్ షాక్ కారణంగా చనిపోయిన సంబంధిత అధికారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. లంక గ్రామాల్లో నోడల్ అధికారులను ఏర్పాటు చేయాలని డిఆర్ఓ కు సూచించారు. అధిక వర్షాలు,వరదలు టైంలో బోట్లు తిరగడం, ఘాట్ లోనికి ప్రజలు వెళ్లకుండా కట్టుదిట్టం చేయాలన్నారు. అగ్నిమాపక శాఖ బోట్లు, లైఫ్ జాకెట్లు, నిల్వ ఉన్న నీటిని తోడేందుకు మోటార్ ఇంజన్లను సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యాశాఖ అధిక వర్షాలు,వరదలు కారణంగా పాఠశాలలకు వెళ్లడానికి వీలులేని ప్రాంతాలలో సమయానుకూలం గా పాఠశాలకు సెలవును ప్రకటించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, డిపిఓ, డివిఓ, ఇరిగేషన్, సివిల్ సప్లయిస్, అగ్నిమాపక, వైద్య, విద్యా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## 12న రోటరీక్లబ్
## నూతన కార్యవర్గం
# ప్రమాణ స్వీకారం




**కొయ్యలగూడెం,మేజర్న్యూస్** :కొయ్యలగూడెం రోటరీ క్లబ్ 28వ పాలకవర్గం పదవీప్రమాణ స్వీకారం ఈ నెల 12వ తేదీ శనివారం రేపల్లివాడ రోటరీ కమ్యూనిటీ హాల్ నందు నిర్వహిస్తున్నట్లు ప్రస్తుత క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పి.రాజశేఖర్, కార్యదర్శి కె.రామచంద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. రోటరీ క్లబ్ 28వ పాలకవర్గం అధ్యక్షునిగా మాజేటి సత్యనారాయణ, కార్యదర్శిగా కొనకళ్ళ రామచంద్రరావుతో పాటు 28 మంది కమిటీ సభ్యులు శనివారం ఉదయం 10 గం.లకు ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు.రోటరీ క్లబ్ డిస్టిక్ట్ గవర్నర్ డాక్టర్ కె.కల్యాణ చక్రవర్తి ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ కార్యక్రమంలో అతిథులుగా పూర్వపు జిల్లా గవర్నర్ వి.భాస్కరరామ్, అసిస్టెంట్ గవర్నర్ ఎ.విశ్వనాథ శర్మ, జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్ అధ్యక్షుడు పి.సురేష్ బాబులు అతిథుగా పాల్గొంటారని తెలిపారు.

## నేటి నుంచి 17 వరకు ఏలూరు
## జి.ఎన్.టి.రోడ్డు రైల్వేగేటు మూసివేత

**ఏలూరు,మేజర్న్యూస్** : ఏలూరు-దెందులూరు రైల్వే స్టేషన్ మధ్య లెవెల్ క్రాసింగ్ నెంబరు 351(489 కి.మీ.) వద్ద అత్యవసర మరమ్మత్తుల నిమిత్తం జూలై 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి జూలై 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు రైల్వే గేటును మూసివేయనున్నట్లు దక్షిణమధ్యరైల్వేసీనియర్ సెక్షన్ ఇంజనీరు ఎస్. లోకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు-దెందులూరు రైల్వేస్టేషన్ మధ్య, ఏలూరు జి.ఎన్.టి. రోడ్డు నుండి నిమ్మకాయల మార్కెట్ యార్డ్ కు వెళ్లే రహదారిలో ప్రయాణించే వాహనాలను ప్రత్యమ్నాయ రహదారిమీదుగా ప్రయాణించాల్సిందిగా ఆయన కోరారు.

## వచ్చే 3 రోజుల్లో భారీ వర్షాలు
## కురిసే అవకాశం

**ఏలూరు,మేజర్ న్యూస్** : గోదావరి బేసిన్‌లో రాబోయే 3 రోజులు భారీ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ,జలవనరుల శాఖల అంచనా మేరకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను అప్రమత్తం చేశారు. ప్రస్తుత అంచనా ప్రకారం సర్దార్ కాటన్ బ్యారేజీలో ఈనెల 12వ తేదీ నాటికి 9 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు చేరే అవకాశం ఉందనీ జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ వారి సమాచారం మేరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని,క్షేత్రస్థాయి సిబ్బంది అందరినీ అప్రమత్తం చేయాలన్నారు.

# వైసిపి కార్పొరేటర్ల పట్ల ప్రోటో కాల్ పాటించడంలేదు

### - జిల్లా కలెక్టర్‌కు నియోజకవర్గ కన్వీనర్ జయప్రకాష్ ఆధ్వర్యంలో వినతి

**ఏలూరు,మేజర్న్యూస్** : నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో వైసిపి కార్పొరేటర్లు పట్ల ప్రోటోకాల్ పాటించడం లేదని,కౌన్సిల్లో మాట్లాడే అవకాశం కల్పించడం లేదని నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ మామిళ్ళపల్లి జయప్రకాష్ ఆధ్వర్యంలో వైసీపీ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ మామిళ్ళపల్లి జయప్రకాష్, ఆ పార్టీ కార్పొరేటర్లు పలువురు మాట్లాడుతూ ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు.

కౌన్సిల్ సమావేశాల్లో ప్రజా సమస్యలు చర్చించకుండా తమను అడ్డుకుంటున్నారని చులకనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కౌన్సిల్ సమావేశాల్లో కోఆప్షన్ సభ్యులు మాట్లాడేందుకు అనుమతి లేనప్పటికీ సభా మర్యాద పాటించకుండా ప్రతిపక్ష సభ్యులను టార్గెట్ చేసుకొని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.నియోజకవర్గంలో జరిగే



పలు అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక కార్పొరేటర్లకు కనీస సమాచారం ఇవ్వకుండా ప్రోటోకాల్ నిబంధనలు పాటించడం లేదని వీటిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కలిసిన వారిలో గుడిదేశీ శ్రీనివాసరావు, నెరుసు చిరంజీవులు,గంట మోహన్ రావు,మున్నుల జాన్ గుర్నాథ్, నూకపెయ్యి సుధీర్ బాబు తుమరాడ స్రవంతి, జి, విజయనిర్మల ,కేదారేశ్వరి డింపుల్ , నిర్మల కుమారి ,రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో కూడా
## మెగా పేరెంట్స్ మీట్

మొదటిపేజి తరువాయి

చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కలు నాటిన విద్యార్థులకు గ్రీన్ పాస్పోర్ట్ అందించడంజరుగుతుందన్నారు. మానసిక ఆరోగ్యం,సైబర్ క్రైమ్‌పై అవగాహన,డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సందేశాలు, పిల్లల పురోగతిపై ఇంటరాక్టివ్‌సెషన్లు నిర్వహించాల న్నారు. 'మెగా పేరెంట్స్ మీట్'ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు జిల్లాలోని వారి ఇతర బ్రాంచ్ లలో కూడా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, మొక్కుబడిగా కాకుండా పండుగ వాతావరణంలో నిర్వహించాలని, విశాలమైన స్థలం లేని పాఠశాలల వారు బయట విశాలమైన ప్రదేశంలో నిర్వహించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ పాఠశాలలో జరిగే విట్నెస్ 'మెగాపేరెంట్స్‌మీట్' కార్యక్రమాలకు సంబంధించి ఫోటోలను, 30 సెకండ్ల కు మించకుండా వీడియో లను లీప్ యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. ఈసమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ, సమగ్ర శిక్షా అభియాన్ ఏపిఓ పంకజ్ కుమార్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రభృతులు పాల్గొన్నారు.

## అల్లూరి మెమోరియల్ హాల్
## పునర్నిర్మాణానికి తక్షణ చర్యలు

మొదటిపేజి తరువాయి

వివరాలతో సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. అతి త్వరలో భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, అధికారులతో చర్చించి మన్యం వీరుడి స్మృతులను భావితరాలకు చాటే విధంగా అల్లూరి మెమోరియల్‌హాలు పునర్నిర్మాణం త్వరితగతిన ప్రారంభించేం దుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ నాయకులు బి.బలరాం, జేఎన్‌వి గోపాలన్, సత్యనారాయణ రాజు, కంతేటి సత్యనారాయణ రాజు,చెరుకువాడరంగసాయి,బి వాసుదేవరావు, సీతారాం ప్రసాద్, దండు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ల్యాప్ టాప్‌లు పంపిణీ చేసిన ఐ.జి,ఎస్పి..

మొదటిపేజి తరువాయి

ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ వృత్తిలో సమర్థవంతంగా వినియోగించు కోవడం ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ రికార్డులు, కోర్టు ప్రాసెసింగ్ వంటి అంశాల్లో మరింత చురుకుదనం సాధించ వచ్చు. కేసుల విచారణ వేగవంతమవడంతో పాటు,ముద్దాయిల కు శిక్షలు నిర్ధారించడంలో ఇదివరకు ఎదురయ్యే సవాళ్లు తగ్గుతాయి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం. సుబ్బారావు (ఇన్‌చార్జి కోర్టు మానిటరింగ్ సెల్), పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

## 208 ఫోన్లు రికవరీ చేసిన
## ప.గో.జిల్లా పోలీసులు

మొదటిపేజి తరువాయి

మొబైల్ దొరికినప్పుడు సొంతంగా ఉపయోగించకుండా వెంటనే పోలీస్ స్టేషన్‌లోఅప్పగించాలని, అలాగే గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బిల్లులు లేని ఫోన్లు కొనరాదని హెచ్చరించారు. లేని పక్షంలో చట్టపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశంఉందనిపేర్కొన్నారు.ఈ విజయవంతమైన రికవరీలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అహ్మదున్నిషా, ఎస్ఐ నాగేశ్వరరావు, ఏఎస్ఐడి.రత్నారెడ్డి,హెడ్‌కానిస్టేబుల్స్ వి.జి.ఎస్. కుమార్, బి.శ్రీనివాస్, కె.వెంకటేశ్వరరావు, మహిళా హెడ్ కానిస్టేబుల్ పి.లక్ష్మికుమారి,కానిస్టేబుల్స్ కె.పాపా రావు,కె.ప్రసాద్ బాబు,ఎస్.భాస్కర్,ఎం.వి.డి.ప్రసాద్,ఎం.అనిల్ కుమార్,కె.అబ్బాస్, కె.శాంతి తదితరులు కృషి చేశారు. వీరిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు,డి.సి.ఆర్.బి ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర రావు, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు. ప్రజలుఈ సౌకర్యాన్ని వినియోగించుకుని, మొబైల్ ఫోన్లు తిరిగి పొందాలని పోలీసులు సూచించారు.

# మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం అందరి భాధ్యతు సీడీపీఓ ఊర్మిళ



**నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్:**ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ మనుషుల అక్రమ రవాణా పై అవగాహనా కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలోసీడీపీఓ ఊర్మిళ మాట్లాడుతూ ఈ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా ఉన్నదని,ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీనికి గురి అవుతున్నారు.ప్రతి ఒక్కరు దీని పైన అవగాహనా కలిగి ఉండాలని ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాల ద్వారా మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారు అని అన్నారు. ప్రతి మహిళ తమ పరిధిలో ఉన్న వారికీ అవగాహనా కల్పించి రక్షించాలని అన్నారు.ప్రజ్వల కోఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడుతూ ఈ అక్రమ రవాణాకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ గత 28 సంవత్సరాలుగా పద్మ శ్రీ డా. సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిషు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యా శాఖ, న్యాయ శాఖల సమన్వయముతో ఇప్పటి వరకు 29,200 మంది అమ్మాయిలను మహిళలను కాపాడి వారికీ పునరావాసం కల్పించినట్లు చెప్పారు. ఐసిడియస్ సూపర్వైజర్ దుర్గ భవాని మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అక్రమ రవాణా ను అరికట్టడంలో అందరు భాగస్వామ్యం కావాలి అని,ప్రతి గ్రామలలో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూప్స్ ను ఏర్పాటు చేయడం ద్వారా అందరు అప్రమతంగా ఉంటారని అన్నారు. అక్రమ రవాణాకు గురి అయినా పిల్లలను శ్రమ దోపిడీ, అవయవాల దోపిడీ లైంగిక దోపిడీ కి అమ్ముతున్నారు. నేటి కాలంలో యువత మొబైల్ ఇంటర్నెట్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కి గురి అవుతున్నారు. అనుమానస్పద వ్యక్తుల నుండి మెసేజ్ గాని కాల్స్ గాని వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని అటువంటి సందర్భాలలో 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఐ సిడిఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆక్వా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

### సిఐటియు త్రిమూర్తులు



**నరసాపురం,మేజర్‌న్యూస్ :** ఆక్వారంగం కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో వెల్కమ్ సీఫుడ్ ఫ్యాక్టరీలో రొయ్యల వలుపు మహిళా కార్మికులను ఉద్దేశిస్తూ త్రిమూర్తులు మాట్లాడుతూ ఆక్వా రంగం ద్వారా ప్రభుత్వానికి ఆక్వా కంపెనీలకు విదేశీ మారకద్రవ్య రూపంలో వేల కోట్ల రూపాయలు ఆదాయం పొందుతున్నారన్నారు.ఆక్వా రంగ పరిశ్రమంలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు సమగ్ర చట్టం లేకపోవడం వల్ల ఆయా పరిశ్రమలో పనిచేస్తున్న కార్మిక వర్గం తీవ్రమైన శ్రమ దోపిడికి గురవుతున్నార న్నారు.ఆక్వా రంగంలో రొయ్య పట్టుబడీ కార్మికుల నుండి వెమెంట్ బాయ్స్ ప్యాకింగ్ బాయ్స్ సూపర్వైజర్స్ ఒలుపు కార్మికులు కంటైనర్ డ్రైవర్స్ అనేక రకాల విభాగాలలో ఆక్వా పరిశ్రమంలో పనిచేస్తున్న కార్మికులకు సమగ్రమైన చట్టాన్ని రూపొందించి వారికి న్యాయం చేయాలన్నారు.ఈ నెల తొమ్మిదో తారీఖున దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోడి లక్ష్మణ్, కోరాడ బద్రి,వంగ దుర్గ ప్రసాద్, పైల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మోడి సుపరిపాలనపై ఇంటింటా గృహసంపర్క్



**ముదినేపల్లి ,మేజర్‌న్యూస్ :** 11 ఏళ్లు మోడీ పాలనపై గృహ సంపర్క్ ఇంటింటా ఘనంగా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో కేంద్రం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు తీరుపై ముదినేపల్లిలో బిజెపి నాయకులు కరపత్రాలు అందజేస్తూ వివరించారు. బిజెపి ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ , మండల అధ్యక్షులు సత్యవోలు నాగలక్ష్మి , జిల్లా కార్యవర్గ సభ్యులు వత్తుమిల్లి ప్రసాద్ , మహిళా మోర్చా అధ్యక్షురాలు రెడ్డి నాగలక్ష్మి , సోషల్ మీడియా ఇన్చార్జ్ భుజంగ వెంకట నరసింహారావు , నాయకులు మీసాల సత్యనారాయణ , కొల్లిపర నాగరాజు , నీలం నాగమల్లేశ్వరరావు , అడుసుమిల్లి సాయి , బండారు పాండురంగారావు , పసుపులేటి నరసింహారావు , పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# కోర్టు ఆర్డంను అమలు చేయండి



ఆదివాసి సేన రాష్ట్ర అధ్యక్షుడు మడకం వెంకటేశ్వరరావు వినతి

**జీలుగుమిల్లి, మేజర్‌న్యూస్:** పి.నారాయణపురం భూములకు కోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను రెవెన్యూ అధికారులు అమలు చేయాలని ఆదివాసి సేన రాష్ట్ర అధ్యక్షులు మడకం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.సోమవారం తాసిల్దార్ కార్యాలయంలోనూ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాన్ని గిరిజనులతో కలిసిఅందజేశారు.ఈసందర్భంగామడకం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలంలో పినారాయణపురం రెవిన్యూ పరిధిలో ఉన్న భూములను 20 సంవత్సరాల క్రితం గిరిజనులకు పట్టాలు మంజూరు చేయగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు.అయితే ఆభూములను పోలవరం నిర్వాసితులకు ఉన్నతాధికారులు కేటాయించడాన్ని తాము తిరస్కరించామని అన్నారు. ఆ భూములపై నిర్వాసిత గిరిజనులకు స్థానిక గిరిజనులకు భూవివాదం నెలకొంటుందని పేర్కొన్నారు. అయితే తమకున్న రికార్డుల ప్రకారం హైకోర్టును ఆశ్రయించగా భూమి స్థానిక గిరిజనులకు చెందుతుందని మిగిలిన వేరెవరికి హక్కు లేదని న్యాయస్థానం ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపారు. తమకిచ్చిన ఆర్డర్లో ఉన్న సర్వే నెంబర్ల ఆధారంగా తమ భూములు తమకు అప్పగించాలని కోర్టు ఆర్డర్ ను అమలు చేయాలని అధికారులను విన్నవించారు. ఏళ్ల తరబడి సాగు చేస్తున్న తమ భూములను వేరొకరికి ఇస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అంతేకాకుండా కొందరు స్థానిక గిరిజనులు గిరిజనేతరులు ఆ భూములలో అక్రమంగా చేరి కౌలుకి ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపించారు. అటువంటి వారిపై కేసుల నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తమ భూములకు ఇచ్చిన కోర్టు ఆర్డర్లో ఉన్న విధంగా భూములు తమకు అప్పచెప్పాలని కోరారు. కానిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేసి తమ భూములు సాధించుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు మడకం శేషారావు, కొరసా ప్రసాద్, సోడెం రామారావు, బన్నే వెంకన్న బాబు, కనితి వెంకట శేషగిరి, 12 గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

## సపరిపాలన తొలిఅడుగు విజయవంతం చేయాలి

### –నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు





**ముదినేపల్లి , మేజర్‌న్యూస్ :** ఎన్డీఏ పాలన ఏడాది గడిచిన సందర్భంగా నిర్వహిస్తున్న సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని వడాలి 82 ,83 ,84వ బూత్ పరిసరాల్లో నిర్వహించారు.ములకలపల్లి గ్రామంలో ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ , బొప్పన సుందరరామయ్య తో కలిసి ఇంటింటిని సందర్శించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు మాట్లాడుతూ ఎన్డీఏ పాలనలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు ఇంటింటికి వెళ్లి వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు,కార్యకర్తలు , పార్టీ శ్రేణులు తరలివచ్చి డోర్ టు డోర్ కార్యక్రమాన్ని పండుగ వాతావరణం లో విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు నక్క అప్పారావు ,కార్యదర్శి కట్టా రామయ్య,బూత్ కన్వీనర్లు కట్టా కోటయ్య , భోజనపు శ్రీ వెంకట గణేష్ , జోగి సుబ్రహ్మణ్యం , అనగాని నాగేశ్వరరావు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్య శాఖలో మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి







**తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ మహిళా ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం తాడేపల్లిగూడెం మండల పరిషత్ సమావేశం మందిరం నందు జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిధిగా రాష్ట్ర కార్యదర్శి, యస్.విజయకుమారి ఎన్.జి.ఓ నాయకురాలు కటికతల జయమణి పాల్గొని మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. ఉద్యోగులకు అడిషనల్ హెచ్ ఆర్ ఏ తీసివేయడం, ప్రమోషన్స్‌లో ఎఫ్ఆర్ఎస్ మొదలగు విషయాలపై చర్చించడం జరిగింది. ఈసమావేశంలో రిటైర్డ్ అయినమహిళా ఉద్యోగులను (సూపెర్వైజర్స్) సన్మానించారు.

అనంతరం పశ్చిమగోదావరి జిల్లా యూనియన్ నూతనశాఖను ఎన్నుకోవడంజరిగింది. జిల్లాఅధ్యక్షురాలుగా జి.రత్నకుమారి (పీహెచ్ఎన్) కార్యదర్శిగా కె.హేనిమెర్సీ కోశాధికారిగా పి.సత్యవతి, గౌరవాధ్యక్షులుగా డి.చండి రాణి, ఈశ్వరి, మంగతాయారు, నాగమణి తదితరులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో మహిళా ఆరోగ్య కార్యకర్తలు (ఏఎన్ఎం) హెల్త్ సూపర్వైజర్స్, విజిటర్స్ పీహెచ్ఎం, సిహెచ్ ఓలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి





**వేలేరుపాడు, మేజర్‌న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని రామవరం గ్రామానికి చెందిన మడకం ప్రకాశ్ ( 25) ద్విచక్ర వాహనం పై శివాకాశిపురం నుండి వేలేరుపాడు వైపు వెళుతుండగా నాగుల గూడెం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి తారు రోడ్డు పై పడటంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి.వెంటనే కుటుంబ సభ్యులు 108 సహాయంతో జంగారెడ్డి గూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండ గా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డి గూడెం ప్రభుత్వ వైద్యశాల కు తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.మృతునికి భార్య,ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

# రైతు పక్షపాతి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం



**-గోస్తనీ నదిలో కిక్కిస తొలగింపు పనులకు శ్రీకారం**

**పెనుమంత్ర, మేజర్ న్యూస్:**గత సార్వ పంటలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రైతులకు సాయం చేయాలని దృక్పథంతో మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చొరవతో జిల్లా వాటర్ డిస్ట్రిబ్యూటరీ సంఘం నిధులతో గోస్తానీ నదిలోని కిక్కీస తొలగింపు పనులకు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ పనులకు శ్రీకారం చుట్టారు. వేల్పూరు నుండి మాముడూరు వరకు గోస్తాని నదిలో పెరిగిపోయిన కిక్కేసా గురపడేక్కులను తొలగించి ఎగువ నుండి దిగువకు మురుగునీరు వచ్చే విధంగా పనులు చేపడుతున్నామని ఈ పనులు పూర్తయితే గోస్తాని నది పరివాహక ప్రాంత పంట భూములు ముంపుకు గురయ్యే ప్రమాదం తప్పుతుందని తెలిపారు. ఇటీవల గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా రైతులు తమ గోడు విన్నవించుకున్నారని రైతుసమస్యల పరిష్కరించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యేలు కృషి చేస్తారని జిల్లా డిస్ట్రిబ్యూటరీ సంఘం చైర్మన మురళీ కృష్ణంరాజు అన్నారు.వేల్పూరు లాకుల నుండి ఎస్.ఇల్లిందిరపర్రు వరకు గోస్తనది మేజర్ డ్రెయిన్ కిక్కిస తొలగింపు పనులు ప్రారంభించడం జరిగింది ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మురళీకృష్ణ రాజు , నీటి సంఘ అధ్యక్షులు దొమ్మేటి భాస్కరరావు, వాటర్ డిస్ట్రిబ్యూటరీ సంఘం అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, ఇరిగేషన్ అధికారులు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**జీలుగుమిల్లి, మేజర్న్యూస్:** ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పి.అంకంపాలెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ 31 ఆవిర్భావ దినోత్సవ మరియు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు సోమవారం ఎంపీటీసీ నాలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తో కలిసి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొని మాట్లాడారు.ముందుగా బాబు జగజ్జివన్ రావు విగ్రహానికి చిర్రి బాలరాజు మాలలు వేశారు. అనంతరం నాయకులు ఎమ్మెల్యే బాలరాజు ని శాలువాతో సత్కరించారు. మాదిగల రిజర్వేషన్ కోసం ఎమ్మార్పీఎస్ స్థాపించి మందకృష్ణ మాదిగ చేసిన కృషిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ నార్లపాటి చిన్న మాదిగ, కంభంపాటి జ్ఞాన సుందరం, మల్లికార్జున్, సీతయ్య నాయకులు, గ్రామస్థులు,కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పల్టీలు కొట్టిన కారు .. అతివేగమే కారణమా?

**స్వల్ప గాయాలతో బయటపడిన దంపతులు**

**పెనుమంత్ర,మేజర్న్యూస్** : ఆలమూరు రైస్ మిల్ వద్దసోమవారం మధ్యాహ్నం తాడేపల్లిగూడెం రోడ్డులో మార్టేరు నుండి చిన్న కారు ప్రమాదానికి గురయ్యింది. ఈ కారు పల్టీలు కొట్టి, రోడ్డు మధ్యలో తల్ల క్రిందులుగా నిలిచి పోయి, కాసేపు ట్రాఫిక్కు ఇబ్బందికలిగింది. అతివేగమే కారణమని స్థానికులు భావిస్తున్నారు. కాగా లోపల ఉన్న భార్యా భర్తలు ఇద్దరూ స్వల్ప గాయాలతో బయట పడ్డారని స్థానికులు తెలిపారు.ఈ ప్రమాదం గురించి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

## గౌరవ వేతనం ఆపదలో ఉన్న వారి కోసం

**డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి**



**నరసాపురం, మేజర్ న్యూస్** :ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళి కృష్ణ (చిన్న) తనకు ప్రతినెల వచ్చే గౌరవవేతనం ను అనారోగ్య సమస్యలతో బాధపడే నీరుపేద కుటుంబాలకి అందజేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం నుండి వచ్చే మొత్తాన్ని చాగంటి ఉమానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తామని ఆయన తెలిపారు. ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న మురళీకృష్ణ ప్రభుత్వం ద్వారా వస్తున్న గౌరవ వేతనం ప్రజలకే ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. దీనిలో భాగంగా సోమవారం పట్టణానికి చెందిన అత్మురి కిషోర్ ఇటీవల అనారోగ్యనకి గురై రెండు కిడ్నీలుపోయి బాధపడుతున్నారు. వారి కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం ను అందించారు. వారి కుటుంబనికి అండగా ఉంటానని ప్రభుత్వం నుండి సహాయం అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, చాగంటి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# అలుపెరగని పోరాట యోధుడు మందకృష్ణ మాదిగ



**బుట్టాయిగూడెం,మేజర్న్యూస్:** అలుపెరగని పోరాట యోధుడు మందకృష్ణ మాదిగని పోలవరం నియోజకవర్గ బిజెపి కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ అన్నారు. స్థానిక అరుంధతి కాలనీ లోని బాబు జగజీవన్ రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవం , మంద కృష్ణ మాదిగ జన్మ దినోత్సవ వేడుకలనుఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహనికి పూలమాలలు వేసిఎంఆర్పీఎస్ జెండాని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కొండేపాటి రామకృష్ణ మాట్లాడుతూ ఏబిసిడి వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ 30 ఏళ్లుగా ఆలుపెరుగని పోరాటం చేసి, బహుజన నాయకుడిగా అనేక ఉద్యమాలు చేశారన్నారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చిడిపి గంగాదర్ రావు, ఉంద్రాజవరపు పెంటయ్య, మర్రి రమేష్, నక్క శివాజీలు మాట్లాడుతూ ఎస్సీ ఉప కులాలకు సమన్యాయం జరగాలంటే ఎస్సీ వర్గీకరణ వలన సాధ్యమవుతుందని ఆదిశగా కూటమి ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కేక్ కట్ చేసి, జగజీవన్ రావ్ విగ్రహం నుండి మెయిన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొబ్బర ఎలిషా, తెల్లం దేవరాజు, బీసీ, ముస్లిం మైనారిటీ నాయకులు ఎం ముసలయ్య, షేక్ ఇమామ్, షేక్ బాజీ, చిడిపి కుటుంబరావు, , దొండపాటి నాగేంద్ర, జాలపర్తి నాగు, దొండపాటి బాలు, మర్రి దుర్గాప్రసాద్ అరుంధతి కాలనీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు దివంగత సీఎం డాక్టర్ వైయస్ జయంతి వేడుకలు వాడవాడలా నిర్వహించాలి



**పోలవరం,మేజర్న్యూస్:** మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు పిలుపు మేరకు పోలవరం మండల అధ్యక్షులు బుగ్గా మురళి కృష్ణ పత్రికా ప్రకటన సోమవారం విడుదల చేశారు.ప్రతి గ్రామంలో ఈనెల 8వ తేదీ మంగళవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలను అన్ని గ్రామ పంచాయతిలలో నిర్వహించాలని, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, వైస్ - ఎంపీపీ, జెడ్పిటిసిలు గ్రామ కమిటీ కో-ఆర్డినేటర్లు వివిధ హోదాలో కలిగిన నాయకులు కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

వైఎస్ఆర్సిపి కార్యకర్తలు అభిమానులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు. డా.వై.యస్.ఆర్ విగ్రహాలను ముందుగానే శుభ్రపరిచి, నూతన రంగులతో అలంకరించడం తో పాటు, పలుసేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సమాయత్తం కావలసిందిగా మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు.

## దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలి

**ఆర్డిఓ దాసిరాజు**




**నరసాపురం ,మేజర్న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధి వహించాలని ఆర్డీవో దాసిరాజు అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 51 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్లోని వివిధ గ్రామాల నుండి ప్రభుత్వం పైన, అధికారుల పైన నమ్మకంతో ప్రజానీకం వస్తున్నారని, వారి సమస్యలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఒకసారి వచ్చిన సమస్య మరోసారి చర్యలుచేపట్టాలన్నారు. సచివాలయ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించటం లేదని ఫిర్యాదు చేశారు. సరిహద్దు, వ్యక్తిగత సమస్యలు, కుటుంబ తగాదాలు పొలాల సమస్యలుతదితరవాటినిఆర్డీవో స్వీకరించారు.

## గురుపౌర్ణమి రోజున శ్రీ కృష్ణ పరమాత్మ కే గురుపూజ చేయాలి

**శ్రీ కృష్ణం వందే జగద్గురుమ్**



**పెదవేగి,మేజర్న్యూస్:** జూలై 10వ తేదీగురు పౌర్ణమి పండుగ ను పురస్కరించుని "త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక" నూజివీడు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం పెదవేగి మండలం లోని పెద్ద కడిమి గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత మరియు అనుబంధ గ్రంథాల ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ అధ్యక్షులు అరుణ్ కుమార్ మాట్లాడుతూ జ్ఞానము బోధించే వాళ్ళను గురువు అంటారు అని , అలాంటిది ఏకంగా భగవద్గీత నే బోధించిన వ్యక్తిని ఏమనాలి అంటే జగద్గురువు అనాలి ఆయన తెలిపారు.

కాబట్టి ప్రపంచానికి అత్యుత్తమ భగవద్గీత జ్ఞానం అందించిన శ్రీకృష్ణుడిని మాత్రమే జగద్గురువు అనాలి, గురు పూజ ఆయనకే చేయాలి తప్ప ఇతరులు గురుపౌర్ణమి రోజు ఆరాధన అనర్హులు. గురుపౌర్ణమి రోజు గొప్ప జ్ఞానం ఇచ్చిన శ్రీకృష్ణ పరమాత్మ ని మాత్రమే జగద్గురువుగా భావించి గురుపూజ చెయ్యాలి అని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ , సభ్యులు కోటేశ్వర రావు, అశోక్, రామాంజనేయులు, శ్రీకాంత్, ఎస్.లైలా లు పాల్గొన్నారు.

# పోలీసుల గ్రీవెన్స్‌కు 55 ఫిర్యాదులు

**– పరిష్కారానికి జిల్లా ఎస్పి శివ కిషోర్ ఆదేశాలు**

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రజలకు పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం ద్వారా పరిష్కారం కార్యక్రమం జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్,అదనపు





ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్య చంద్రరావు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఉపయోగించి ఫిర్యాదుల ప్రక్రియను పారదర్శకంగా, కాగిత రహితంగా నిర్వహించారు. ఫిర్యాదుదారులు తమ ఫిర్యాదులను స్వయంగా ఎఐ బోట్ కు అంద చేశారు.ఫిర్యాదు దారులు నేరుగా ఎఐ బోట్ కి తెలియచేసిన వెంటనే వారి ఫిర్యాదు వివరాలను డాక్యుమెంట్‌లోకి మార్చిన ఎఐ బోట్.ఈ మొత్తం ప్రక్రియ పూర్తిగా డిజిటల్‌గా ఉంటుంది,దీనివల్ల కాగిత వినియోగం ఉండదు. ఫిర్యాదు దారులు తాము చెప్పిన విషయాలను తిరిగి వినవచ్చు, ఇది పారదర్శకతను పెంచుతుంది.ఈ సందర్భంగా జిల్లాఎస్పీ మాట్లాడుతూ పజలు సమస్యలపై వారి ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు, ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్‌సైట్: https://meekosam.ap.gov.in అందుబాటులో ఉన్నట్లుఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే, 1100 (డబుల్ వన్ డబుల్ జీరో) టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయవచ్చున్నారు. పెదవేగి నుంచి ఒక వృద్ధుడు ఎస్పీని పబ్లిక్ గ్రీవెన్స్ నందు కలవడానికి రాగా ఎస్పీ వృద్ధుని వద్దకు వెళ్లి అతని ఫిర్యాదుని విషయాలను గురించి తెలుసుకొని వెంటనే పెదవేగి ఇన్స్పెక్టర్‌కి ఫోన్ చేసి సమస్యను పరిష్కరించి జిల్లా ఎస్పీకి తెలియజేయాలని ఆదేశాలు ఇచ్చారు.ఈ రోజు కార్యక్రమానికి మొత్తం 55 ఫిర్యాదులు అందాయి. వాటి గురించి ఎస్పీ, అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్య చంద్రరావు ఫిర్యాదిదారులతో ముఖా ముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు ఫిర్యాదులలో ఎక్కవగా భూ వివాదాలు, కుటుంబ తగాదాలు, మోసపూరిత లావాదేవీలు సంబంధించిన సమస్యలు మొదలైనవి వచ్చాయి అని.పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమంనకు జిల్లా నలుమూలన నుంచి వచ్చినటువంటి ఫిర్యాది దారులకు ఏలూరు శ్రీ సత్యసాయి సంఘం భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు.



# మనవడు పేరుతో ఆస్తి రాస్తానన్నందుకు తండ్రిపై కర్కశంగా కుమారుడి దాడి

**పెనుమంట్ర, మేజర్‌న్యూస్ :**ఆస్తిని తనపేరు మీద కాకుండా, మనవడి పేరుమీద వ్రాస్తాను అంటున్న తండ్రి ని గడ్డపారతో తీవ్రంగా గాయపరిచిన కొడుకు ఉదంతం తెలిసింది.సోమవారం ఉదయం ఈ సంఘటన మండలంలోని మల్లిపూడి గ్రామంలో జరిగింది. స్టేషన్ ఎస్.ఐ. కే. స్వామి తెలిపిన సమాచారం ప్రకారం మల్లిపూడి గ్రామానికి చెందిన గుడిమెట్ల కృష్ణా రెడ్డి 71 సంవత్సరాలు వయసుగల వృద్ధుడిని ఆయన కుమారుడు
కుమారుడు వెంకట రెడ్డి ఆస్తి తనపేరు మీద కాకుండా, మనవడి పేరు మీద వ్రాస్తానని చెబుతున్నారని తండ్రి మీద కక్ష పెంచుకున్న కొడుకు గడ్డ పారతో దాడి చేసాడు.తీవ్రంగా గాయపడ్డ తండ్రి కృష్ణా రెడ్డి ని 108 వాహనం మీద తణుకు గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు.అతని పరిస్థితి నిలకడగా ఉందని,కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

# పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి








**– సిపిఐ ఏలూరు జిల్లా ద్వితీయ మహాసభ తీర్మానం**

**చింతలపూడి,మేజర్ న్యూస్ :** పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకరిస్తున్న నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని.మండలాన్ని యూనిట్ గా తీసుకొని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, మెరుగైన పునరావాసంతో పాటు ఉపాధి కల్పించాలని సిపిఐ ఏలూరు జిల్లా ద్వితీయ మహాసభ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ తీర్మానం చేసినట్లు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య,సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా ద్వితీయ మహాసభలు చింతలపూడి, యర్రగుంటపల్లి రాధా గార్డెన్స్‌లో ఈ నెల 5,6,7 తేదీలలో జరిగిన సభలలో ఆమోదించిన తీర్మానాలను సోమవారం చింతలపూడి విలేకరులకు తెలిపారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన మన్నవ కృష్ణ చైతన్య,సహాయ కార్యదర్శిగా ఎన్నికైన బండి వెంకటేశ్వరరావు మహాసభలో చేసిన తీర్మానాలను మీడియాకు విడుదల చేశారు. మహాసభ 45 మంది జిల్లా సమితి సభ్యులను,12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నది.జిల్లా కార్యవర్గ సభ్యులుగా మన్నవ కృష్ణ చైతన్య,బండి వెంకటేశ్వరరావు,ఎండి మున్నీర్,కారం దారయ్య,బాడిశ రాము,జెవి రమణ రాజు,యు హేమ శంకర్,ఆర్ఎస్ డాంగే,వరక శ్యామల, నిమ్మగడ్డ నరసింహ,కొన్నే లక్ష్మయ్య, తొర్లపాటి బాబు (ఆహ్వానితులు) ఎన్నికయ్యారు. పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన సందర్భంగా ప్రకటించిన 45.72 మీటర్లు ఎత్తులోనే నిర్మించాలని మహాసభ తీర్మానించింది. ఏజెన్సీ ఏరియాలో దశాబ్దాల తరబడి పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులు గిరిజన ఇతర పేదలకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మహాసభ తీర్మానించింది.చింతలపూడి నూజివీడు నియోజకవర్గాలతో పాటు ఎన్టీఆర్ జిల్లాకు సాగు నీరు త్రాగునీరుకు ఉపయోగపడే చింతలపూడి ఎత్తిపోతల పథకం పేజ్ 1,పేజ్ 2 నిర్మాణ పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ మహాసభ తీర్మానం చేసింది. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను హరిస్తూ కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడాన్ని నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు జులై 9న దేశవ్యాప్తంగా చేస్తున్న సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలుపుతూ మహాసభ తీర్మానించింది. చింతలపూడిలో బొగ్గు నిల్వలను వెలికి తీయాలని తద్వారా నిరుద్యోగ యువతకి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాలను కోరుతూ మహాసభ తీర్మానించింది. పెదవేగిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న పామ్ ఆయిల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం విడనాడాలని మహాసభ తీర్మానించింది.బహిరంగ సభ నిర్వహణకు గ్రౌండ్ ఇచ్చిన చెలికాని రామారావు తనయుడు నరసింహారావుకి, ఎర్రగుంటపల్లిలో ప్రతినిధుల సభ జరపటానికి రాధా గార్డెన్స్ ని ఇచ్చిన కారుమూడి రమేష్‌కి అభినందనలు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తొర్లపాటి బాబు,జిల్లా సమితి సభ్యులు కంచర్ల గురవయ్య,దొంతా కృష్ణ,తొర్లపాటి రాజు ముళ్ళగిరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నిత్య అన్నదాన ట్రస్ట్‌కు రూ.1లక్ష విరాళం



**ద్వారక తిరుమల, మేజర్ న్యూస్:** శ్రీ ఒకుళ మాత నిత్య అన్నదాన ట్రస్ట్ కు హనుమాన్ జంక్షన్ వాస్తవ్యులు దేవినేని విష్ణుకుమార్ ఒక లక్షవిరాళం సమర్పించారు. ముందుగా స్వామి అమ్మవాళ్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.అనంతరం ఆలయ ఆఫీసులో నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ1లక్ష విరాళాన్ని సమర్పించారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ హైగ్రీవ అప్పలా చార్యులు స్వామి వారి ప్రసాదాలను బాండ్ పత్రాలను అందించి అభినందనలు తెలిపారు.

## స్విమ్మింగ్ పూల్‌కి రూ.1లక్ష రూపాయలు విరాళం




**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :** తాడేపల్లిగూడెం అభివృద్ధి ధ్యేయంగా పాటుపడుతున్న ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ కి విజ్జు దుర్గాప్రసాద్ నాయుడు స్విమ్మింగ్ పూల్ నిమిత్తం లక్ష రూపాయలు విరాళాన్ని అందించారు. నియోజకవర్గ అభివృద్ధిలో ప్రజల దాతల సహకారం మరవలేనిదని ఆయన తెలిపారు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన విద్యుత్ దుర్గాప్రసాద్ నాయుడిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అభినందించారు. నియోజకవర్గ అభివృద్ధి కి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి అనిల్, పాలూరి వెంకటేశ్వరరావు, పుల్లా బాబి, కాంట్రాక్టర్ శివ,పాలూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రిబుల్ ఐటీలో విద్యార్థుల లాప్టాప్,బట్టలు,డబ్బులు చోరీ

**– భారత విద్యార్థి ఫెడరేషన్ ఆరోపణ**

**: కేసు నమోదుకు డిమాండ్**



**నూజివీడు,మేజర్ న్యూస్ :** ఏలూరు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కె లెనిన్ వ రా ట్లా డ ు తూ రా నూజివీడు పట్టణంలో ఉన్న త్రిబుల్ ఐటీ కళాశాలలో మే నెలలో విద్యార్థులకు సెలవులు ఇచ్చారు తిరిగి జూలై నెలలో విద్యార్థులు కళాశాలకు తిరిగి రాగానే విద్యార్థులు కేటాయించిన బ్లాక్ ఐ మూడవ అంతస్తులు దాదాపు 80 రూములు పైగానే తాళాలు పగలగొట్టి విద్యార్థి బట్టలు బూట్లు లాప్టాప్ ట్రాలీ బ్యాగులు విద్యార్థులు కనిపించలేదు ఈనెల 4వ తారీఖు విద్యార్థులు కొంతమంది కళాశాలకు రాగానే పరిస్థితి చూసి మేనేజ్మెంట్ కి మెయిల్ పెట్టగా మేము చూస్తామని చెప్పారు. మరల ఈనెల 12వ తారీకు కల్లా మీరు రూమ్ ఖాళీ చేసి వెళ్ళిపోమంటున్నారు. సమస్య పరిష్కారం కాకుండానే విద్యార్థుల విలువైన వస్తువులు ఎక్కడికి పోయాయో ఏమిటో కూడా తెలియకుండా ఉందని విద్యార్థులు ఆందోళన గురవుతున్నారు. త్రిబుల్ ఐటీలో చుట్టూ సీసీ కెమెరాలు పదుల సంఖ్యలో సెక్యూరిటీ గార్డులు ఉండగా రూములో తాళాలు పగలగొట్టి విద్యార్థుల విలువైన వస్తువులు ఎక్కడికి పోతాయని ప్రశ్నించారు. నిర్వహణ లోపం ఉంది వెంటనే విద్యార్థులు సమస్త పరిష్కరించాలని విద్యార్థి వస్తువులు ఎవరు తీసుకెళ్లారు తెలియాలని వారి పై ఎఫ్ఆర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎం.శివ,ఎస్. శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# 10న జరిగే మెగా పేరెంట్స్,టీచర్స్ మీట్‌కు భారీ ఏర్పాట్లు





**- జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యులను చేస్తున్నాం**

**- తల్లికి వందనం పేరిట 1,76,574 మంది తల్లులకు రూ.229.55 కోట్లు చెల్లింపు**

**భీమవరం,మేజర్‌న్యూస్ :** ఈ నెల10వ తేదీన పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు,జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను పెద్ద ఎత్తున పండుగ వాతావరణంలో నిర్వహించుటకు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిజిఆర్ఎస్ సమావేశ మందిరం నుండి జిల్లా అధికారులతో ప్రత్యక్షంగాను, డివిజన్, మండల స్థాయి అధికారులతో వర్చువల్ గాను సమావేశాన్ని నిర్వహించి జిల్లాలో నిర్వహించనున్న పేరెంట్స్, టీచర్స్ మీట్ ఏర్పాట్లపై సమీక్షించారు. ప్రభుత్వం విద్యార్థులకు బంగారు భవిష్యత్తును దిశా నిర్దేశం చేసే విధంగా పేరెంట్స్,టీచర్స్‌మీట్‌ను రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో జూలై 10న పండగ వాతావరణంలో నిర్వహించేందుకు ఆదేశించడం జరిగిందన్నారు.ఇది చాలా గొప్ప కార్యక్రమం అని, విద్యార్థులకు మంచి భవిష్యత్తు చేకూరాలనేలక్ష్యంతోజిల్లాలో చేపట్టిన కార్యక్రమం విజయ వంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం చెప్పింది ఏదో చేస్తున్నావ్ అనే ధోరణి కాకుండా విద్యార్థులకు సంబంధించిన మంచి కార్యక్రమంగాఅంకితభావంతో చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు జిల్లాకు సంబంధించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, రాజ్యసభ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మెంబర్లు, జడ్పిటిసి, ఎంపీటీసీ, స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరిని ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వామ్యులను చేయాలని కోరారు.ఎవరికి సంబంధించిన వ్యక్తిగత బ్యానర్లను కార్యక్రమం వద్ద పెట్టవద్దని, ప్రభుత్వం సూచించిన బ్యానర్లు మాత్రమే ఉండేలా చూడాలని ఆదేశించారు.

పేద కుటుంబాలకు చదువు భారం కాకూడదని నచ్చిన పాఠశాలలో విద్యను అభ్యసించేలా తల్లికి వందనం పేరిట 1,76,574 మంది తల్లులకు రూ.229.55 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం ప్రభుత్వం అందజేసిందన్నారు.తల్లులకు రంగోలి పోటీలను,తండ్రులకు తగ్గాఫ్ వార్, లెమన్ అండ్ స్పూన్ ఆటల పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ ను దిగ్విజయం చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు,డిఇఓ ఇ.నారాయణ,ఏపీసి శ్యాంసుందర్, డిఐఈఓ గొల్ల ప్రభాకర్ రావు,వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మెగా పేరెంట్ - టీచర్ల సమావేశానికి ముందస్తు చర్యలు



**ఏలూరు రూరల్ ,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర శిక్ష పాఠశాల విద్య అమరావతి ఆదేశానుసారం తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం మెగా పేరెంట్ - టీచర్ల సమావేశం నిర్వహణ ముందస్తు కార్యక్రమం సోమవారం మానూరులోని ఎంపిఎస్ పాఠశాలలో జరిగింది. తల్లిదండ్రులకు ఈనెల 10వ తేదీ గురువారం జరిగే కార్యక్రమానికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఇందులో భాగంగానే బాలబాలికలకు షూస్ పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈకార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు తేర ప్రసాద్,టి.అరుణ టీచర్,ఎస్ఎంసి చైర్ పర్సన్ పేరం రాము,తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ,అనుబంధ రంగాల లక్ష్యాలు సాధించాలి

## - సిసిఆర్‌సి కార్డులు అందించాలి : జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర,జిల్లా ఆర్థిక పురోగతికి దోహదపడే వ్యవసాయ అనుబంద రంగాలపై పూర్తిదృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్, మైక్రోఇరిగేషన్, అన్నదాత సుఖీభవ, సిసిఆర్ సి కార్డులు, ఈ పంట, ఎరువుల పంపిణీ, మామిడి పంట, పంటల భీమా,వ్యవసాయ ఆధునీకరణ యంత్రాలు తదితర అంశాలపై కలెక్టర్ వెట్రిసెల్వి సుధీర్ఘంగా సమీక్షించి అధికారులకు దిశా, నిర్ధేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ కింద ఇప్పటివరకు గుర్తించిన 5,169 హెక్టార్లలో జూలై నెలాఖరుకల్లా ప్లాంటేషన్ పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ఈఏడాది 13 వేల హెక్టార్లలో ఆయిల్ ఫామ్ అధనపుసాగు చేపట్టాలని లక్ష్యంగా తీసుకోవడం జరిగిందని, వీటిని ఖరీఫ్, రభీ కాలంలో పూర్తిచేసేందుకు ప్రణాళిక బద్ధంగా వెళ్లాలన్నారు. ఎక్కడైనా నకిలీ, గుర్తింపులేని ఏజెన్సీల ద్వారా ఎరువులు,విత్తనాలు అమ్మకాలు జరిగినట్లు గుర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎరువులకు కొరతలేదని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. కిసాన్ డ్రోన్లకు సంబంధించి జిల్లాకు ఇప్పటికే40కేటాయించగా మరో20అధనంగా కేటాయించ బడ్డాయన్నారు. ఇందుకు సంబంధించి వరిసాగుచేసే ప్రాంతాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి అర్హులైన వారికి డ్రోన్లు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు ఈఏడాది రూ. 375 కోట్లు పంట రుణాలు అందించాలనే లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.అర్హులైన ఎఒక్కరూ రుణం అందలేదనే మాటరాకుండాచర్యలు తీసుకోవాలన్నారు. ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఈ పంట నమోదును జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. పంట నష్టపరిహారంఅందించేందుకు ఈ పంట ఎంతో ప్రధానమైన దన్నారు.సమావేశంలో జిల్లా ఉధ్యానవనశాఖ అధికారి ఎస్. రామ్మోహన్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ భాషా, ఆయా మండలాల్లోని వ్యవసాయ, ఉధ్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం

**- పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వమని, రెడ్‌బుక్‌లో రాసుకున్న హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం( పిడియస్‌యు)రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ ప్రశ్నించారు. సోమవారం ఏలూరు నగరంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా పీడీఎస్‌యు రాష్ట్రఅధ్యక్షుడు కె.భాస్కర్,జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాకి నాని, మహర్షి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయింది. విద్యారంగ సమస్యలు అపరిష్కృతంగానే మిగిలి ఉన్నాయి. రాష్ట్రంలో పాఠశాల విలీన ప్రక్రియ వలన జీవో నెంబర్ 19,20 వలన వేలాది పాఠశాలలో మూతపడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 6,400 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్రలో రెడ్ బుక్‌లో రాసుకున్న జీవో నెంబర్ 77ను ఎప్పుడు రద్దు చేస్తారని అన్నారు. ఈ వలన పేద బడుగు బలహీనవర్గాల విద్యార్థులు పీజీ విద్యకు దూరమవు తున్నారు. తల్లికి వందనం పథకాన్ని 2024-25 విద్యా సంవత్సరంలో అమలు చేయకుండా ఈ విద్యా సంవత్సరంలో అనేక షరతలు విధించారు. దీనివలన లక్ష మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి దూరమవుతున్నారు. మెడికల్ కళాశాలలో ప్రైవేట్ పరం చేస్తా ఉన్నారు, మెడికల్ కళాశాల భూములు కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతున్నారు. మెడికల్ విద్య ప్రైవేటీకరణ చేసే జీవో నెంబర్ 107,108 రద్దు చేయాలి. సంక్షేమ హాస్టల్‌లు సంక్షోభంలో ఉన్నాయి.నిత్యవసర వస్తువు ధరలు విపరీతంగా పెరుగు తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బి. వినోద్.ఏలూరు నగర అధ్యక్ష కార్యదర్శులు సొంగ సునీల్ కుమార్, వై యశ్వంత్, సిహెచ్ ప్రవీణ్, కే.పుజిత్ తదితరులు పాల్గొన్నారు.

# బాగుపడిన బాలయోగి సైన్స్ పార్క్ మార్గం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** 2 వేల మంది హాస్టల్ విద్యార్థుల రోడ్డు సమస్యపరిష్కారానికై ప్రభుత్వ అధికారుల స్పందనకు,కృషి, చర్యలకు కృతజ్ఞతాభివందనాలు. అది బాలయోగి సైన్స్ పార్క్ మార్గం.అది 2వేల మంది సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ విద్యార్థులు నిత్యం వచ్చి,వెళ్లే దారి. సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ లకు వెళ్లే రహదారి సంవత్సరాలుగా గోతులు,బురద మయంగా ఉంది. ప్రతిరోజు 2వేల మంది హాస్టల్స్ విద్యార్థులు గోతులు,బురదతో అనేక ఇబ్బందులు పడుతున్నారు.

దాన్ని వెంటనే బాగు చేయించాలని సిఐటియు చేసిన అభ్యర్థనకు జిల్లా కలెక్టర్,సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకొని రోడ్డు మరమ్మతులు చేయించి, విద్యార్థులకు ఇబ్బందిలేకుండాచర్యలు తీసుకున్నందుకు సిఐటియు తరఫున ప్రత్యేకకృతజ్ఞత అభివందనలు, ధన్యవాదాలు తెలిపారు.